శంషాబాద్ మున్సిపల్ ప్రత్యేక అధికారిగా శ్రీధర్

బాధ్యతలు స్వీకరిస్తున్న మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ జాయింట్ డైరెక్టర్ శ్రీధర్

శంషాబాద్ రూరల్, జనవరి 27: శంషాబాద్ మున్సిపాలిటీ ప్రత్యేకాధికారిగా మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ జాయింట్ డైరక్టర్ శ్రీధర్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శంషాబాద్ మున్సిపాలిటీ పాలకవర్గం పదవీ కాలం పూర్తి కావడంతో సోమవారం నుంచి ప్రత్యేకాధికారి పాలన కొనసాగుతుందన్నారు. అందులో భాగంగా ప్రభుత్వ ఆదేశాల మేరకు తాను శంషాబాద్ మున్సిపాలిటీ ప్రత్యేకాధికారిగా బాధ్యతలు స్వీకరించిన్నటలు తెలిపారు. మున్సిపాలిటీ ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని వివరించారు. ప్రభుత్వ పథకాలతో పాటు అభివృద్ధి పనులు అవసరమైన చోట చేపడుతామన్నారు.

ప్రజావాణికి మూడు ఫిర్యాదులు

రాజేంద్రనగర్ జీహెచ్ఎంసీ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో పాల్గొన్న డిప్యూటీ కమిషనర్ రవికుమార్

బండ్లగూడ,జనవరి 27: ప్రజా వాణిలో వచ్చిన ఫిర్యాదులను వెంట వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని రాజేంద్రనగర్ జీహెచ్ఎంసీ డిప్యూటీ కమిషనర్ రవికుమార్ పేర్కొన్నారు.సోమవారం సర్కిల్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో ప్రజల నుంచి మూడు ఫిర్యాదులు వచ్చినట్లు ఆయన తెలిపారు.ఆయా ఫిర్యాదులను సంబంధిత అధికారులకు అందజేసినట్లు తెలిపారు.

యూసుఫ్‌గూడలో ప్రజావాణి..

జూబ్లీహిల్స్: యూసుఫ్‌గూడలోని జీహెచ్ఎంసీ 19 వ సర్కిల్ కార్యాలయంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమం నిర్వహించి ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరించారు. డిప్యూటీ కమిషనర్ జాకియా సుల్తానా ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఈఈ రాజ్ కుమార్, డిప్యూటీ ఈఈ రామచంద్రరాజు, ఇన్‌చార్జి ఏఎంసీ బాలరాజ్ పాల్గొన్నారు.

సిబ్బంది కొరత..సేవలకు అంతరాయం

- కొట్టుమిట్టాడుతున్న సమస్యలు
- ప్రజాదరణ కోల్పోతున్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు..
- బదిలీపై వెళ్లిన సిబ్బంది స్థానంలో భర్తీ చేయని డిపార్ట్‌మెంట్
- ప్రజావాణిలో కూడా ఫిర్యాదులు..

శ్రీరాంనగర్ క్లస్టర్ బోరబండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని డెలివరీ ఆపరేషన్ థియేటర్. (ఫైల్)

జూబ్లీహిల్స్, జనవరి 27 : పేద ప్రజల ఆరోగ్య నేస్తాలుగా ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో రోగులకు ఆశించిన స్థాయిలో వైద్య సేవలందడం లేదన్న అసంతృప్తి వ్యక్తమవుతుంది. ప్రతినిత్యం ఆరోగ్య పరీక్షలు చేయించుకునే ప్రజలతో కిటకిటలాడిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు సిబ్బంది కొరతతో సతమతమవుతున్నాయి. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో పేద ప్రజలకు అభయమిచ్చిన ఈ ఆరోగ్య కేంద్రాలు నేడు వెలవెలబోతున్నాయి. ఇటీవల శ్రీరాంనగర్ క్లస్టర్‌లోని 6 పీహెచ్‌సీలలో భారీగా బదిలీలు జరిగినా ఆయా ఖాళీలను పూర్తిస్థాయిలో భర్తీ చేయలేదు. దీంతో ఎక్కువగా బస్తీలున్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఆశించిన స్థాయిలో వైద్య సేవలు అందించలేకపోతున్నారు.

- క్లస్టర్ పరిధిలోని బోరబండ పీహెచ్‌సీలో ఆపరేషన్ థియేటర్ ఉన్నప్పటికీ గర్భిణులకు అవసరమైన సేవలందకపోవడంతో మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రెగ్యులర్ డాక్టర్ లేకపోవడంతో గత ఏడాదిగా ఆర్‌బీఎస్‌కే మెడికల్ ఆఫీసర్ వైద్య సేవలందిస్తున్నారు. అయితే డెలివరీ పాయింట్‌గా ఉన్న బోరబండ పీహెచ్‌సీలో సిబ్బంది కొరతతో గర్భిణులకు అందించాల్సిన సేవలు అందని ద్రాక్షగా మారిపోయాయి. బోరబండలో అదనపు డాక్టర్‌తో పాటు 1 స్టాఫ్ నర్స్, ఇద్దరు ఏఎన్ఎంలు కొరత ఉండడంతో 24 గంటలు ప్రసూతి సేవలందించాల్సిన ఈ పీహెచ్‌సీలో కొంతకాలంగా ఈ సేవలు నిలిచిపోయాయి.
- శ్రీరాంనగర్‌లో 1 స్టాఫ్ నర్స్, 2 ఏఎన్ఎంలు.. వినాయక్ నగర్‌లో 1 ఏఎన్ఎం, 1 స్టాఫ్ నర్స్‌ల కొరతతో పాటు ఈ మూడు పీహెచ్‌సీలలో ఫార్మాసిస్ట్‌లు లేకపోవడంతో ఉన్న ఒక స్టాఫ్‌నర్స్ అదనంగా ఫార్మాసిస్ట్ విధులు నిర్వహిస్తున్నారు. దీంతో బస్తీలలో వైద్య సదుపాయాలకు దూరంగా ఉన్న పేద ప్రజల్లో సరైన వైద్య సేవలందడం లేదన్న ఆందోళన వ్యక్తమవుతుంది. ఇటీవల ఈ విషయమై స్థానికులు ప్రజావాణిలో కూడా ఫిర్యాదులు చేసినప్పటికీ పరిస్థితుల్లో పెద్దగా మార్పు రాలేదు.
- శ్రీరాంనగర్ క్లస్టర్‌లో యూసుఫ్‌గూడ బస్తీ, కార్మికనగర్, ఎస్‌పీఆర్ హిల్స్, బోరబండ, జవహర్ నగర్, యాదగిరి నగర్‌తో పాటు 18 బస్తీ దవాఖానలున్నాయి. అయితే ఓపీ సేవలు మాత్రమే అందించాల్సిన వీటిలో సరిపోయినంత సిబ్బంది ఉన్నప్పటికీ మౌలిక వసతుల సమస్యలు వేధిస్తున్నాయి.

అమీర్‌పేట్ క్లస్టర్‌తో కలిసి ప్రసూతి సేవలు

పీహెచ్‌సీలలో వైద్య సేవలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నాం. బోరబండలో సేవలకు అంతరాయం కలిగిన కారణంగా అమీర్‌పేట్ క్లస్టర్‌తో కలిసి ప్రసూతి సేవలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నాము. ప్రధానంగా గర్భిణులకు శ్రీరాంనగర్ సామాజిక ఆరోగ్య కేంద్రంతో పాటు అమీర్‌పేట్ పీహెచ్‌సీ, నిలోఫర్ దవాఖానలలో సేవలను అందిస్తున్నాం. బోరబండ పీహెచ్‌సీలో గైనకాలజీ డాక్టర్‌తో పాటు ఇద్దరు స్టాఫ్‌నర్స్‌లను కేటాయిస్తే డెలివరీ సేవలు అందించేందుకు సిద్ధంగా ఉన్నాం.

– డాక్టర్ బి.విజయనిర్మల, ఎస్‌పీహెచ్ఓ, శ్రీరాంనగర్ క్లస్టర్..

నేషనల్ పోలీస్ అకాడమీలో రక్తదానం

సర్దార్ వల్లభాయి పటేల్ జాతీయ పోలీస్ అకాడమీ తలసేమియా అండ్ సికిల్ సెల్ సొసైటీ వారు సంయుక్తంగా సోమవారం రక్తదాన శిబిరం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి జాతీయ పోలీస్ అకాడమీ డైరెక్టర్ అమిత్‌గార్గ్ ముఖ్యఅతిథిగా విచ్చేసి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో తలసేమియా సికిల్ సెల్ సొసైటీ అధ్యక్షుడు డాక్టర్ చంద్రశేఖర్ అగర్వాల్,అలీమ్‌బేగ్ తదితరులు పాల్గొన్నారు. – బండ్లగూడ,జనవరి 27

జీతాలు చెల్లించాలంటూ ఆందోళన

జూబ్లీహిల్స్ వార్డు కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న వీధి దీపాల సిబ్బంది

బంజారాహిల్స్,జనవరి 27: ఆరు నెలలుగా తమకు జీతాలు రావడం లేదంటూ జీహెచ్ఎంసీ వీధిదీపాల విభాగంలో పనిచేస్తున్న సిబ్బంది సోమవారం ఆందోళనకు దిగారు. జీహెచ్ఎంసీ ఖైరతాబాద్ జోన్ స్ట్రీట్ లైట్స్ విభాగానికి అనుబంధంగా ఉండే ఎనర్జీ ఎఫిషియెన్సీ సేవింగ్ సర్వీసెస్ లిమిటెడ్ పరిధిలో పనిచేస్తున్న 13మందికి ఆరునెలల నుంచి సంబంధిత ఏజెన్సీ నుంచి జీతాలు రావడం లేదు.జీహెచ్ఎంసీని అడిగితే మీరంతా ఎనర్జీ ఎఫియెన్సీ సేవింగ్ సర్వీసెస్ అనే ఏజెన్సీ కిందకు వస్తారని, జీతాలు ఇచ్చే బాధ్యత వారిదేనంటూ తప్పించుకుంటున్నారని, వారి వద్దకు వెళ్తే తమకు బిల్లులు రాకపోతే జీతాలు ఎలా ఇస్తామంటూ ప్రశ్నిస్తున్నారన్నారు. దీనిలో భాగంగా ఉద్యోగులు జూబ్లీహిల్స్‌లోని వార్డు కార్యాలయం వద్ద ఆందోళనకు దిగారు. తమకు జీతాలు ఇవ్వకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రమేష్. ప్రదీప్, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

బీఈ కోర్సుల పరీక్ష తేదీల ఖరారు

ఉస్మానియా యూనివర్సిటీ, జనవరి 27: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని బీఈ కోర్సుల పరీక్ష తేదీలను ఖరారు చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. బీఈ (ఏఐసీటీఈ) మొదటి, మూడు, అయిదు, ఏడో సెమిస్టర్ మెయిన్, అన్ని సెమిస్టర్ల బ్యాక్‌లాగ్, బీఈ (సీబీసీఎస్), బీఈ (నాన్ సీబీసీఎస్) కోర్సుల అన్ని సెమిస్టర్ల బ్యాక్‌లాగ్ పరీక్షలను వచ్చే నెల 4వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు తెలిపారు. పరీక్ష తేదీల పూర్తి వివరాలను ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవచ్చని సూచించారు.

కాళికా నగర్‌లో సీసీ కెమెరాల ఏర్పాటు



కాళికానగర్‌లో సీసీ కెమెరాలను ప్రారంభిస్తున్న మాజీ కార్పొరేటర్ సాగర్‌గౌడ్

బండ్లగూడ,జనవరి 27: నేర నియంత్రణలో సీసీ కెమెరాలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని మాజీ కార్పొరేటర్ సాగర్‌గౌడ్ అన్నారు.బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కాళికానగర్‌లో ఆయన 50 సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ ఇంటి ముందు సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో కాలనీ వాసులు పాల్గొన్నారు.

సింగపూర్ యూనివర్సిటీ ఆహ్వానం

శంషాబాద్ రూరల్, జనవరి 27 : శంషాబాద్(రాజేంద్రనగర్) డిగ్రీ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ సామ రవీందర్‌రెడ్డికి సింగపూర్‌లో జరిగే అంతర్జాతీయ సెమినార్‌కు ఎంపిక చేసి ఆహ్వానం పంపినట్లు సోమవారం తెలిపారు. సస్టైనబుల్ ఇండియా భాగ్యస్వామ్యంతో నిర్వహిస్తున్న అంతర్జాతీయ సెమినార్ సింగపూర్ యూనివర్సిటీ పాల్గొనడం కోసం అవకాశం రావడం ఆనందంగా ఉందన్నారు. ఆహ్వాన పత్రాలను ప్రొఫెసర్ హరగోపాల్, షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, పర్యవరణ ప్రొఫెసర్ పురుషోత్తంరెడ్డిలు సోమవారం అందజేశారని వివరించారు.

ఉద్యోగుల వయోపరిమితిని పెంచొద్దు

ఎస్ఎన్‌రెడ్డి భవన్‌లో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న ధర్మేంద్ర

హిమాయత్‌నగర్,జనవరి27: ఉద్యోగుల వయోపరిమితి పెంచే ఆలోచనను ప్రభుత్వం విరమించుకోవాలని ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ధర్మేంద్ర డిమాండ్ చేశారు. సోమవారం హిమాయత్‌నగర్‌లోని ఎస్ఎన్‌రెడ్డి భవన్‌లో ముఖ్య నేతల సమావేశం జరిగింది.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఉద్యోగుల వయోపరిమితి వయస్సు పెంచడం వల్ల నిరుద్యోగ యువతకు తీరని అన్యాయం జరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు.కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఏడాదికి రెండు లక్షల ఉద్యోగాలను భర్తీ చేస్తామని చెప్పి ఉద్యోగ నోటిఫికేషన్లు ఇవ్వకుండా కాలయాపన చేస్తుందని విమర్శించారు.ఈ సమావేశంలో ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు ఎన్.శ్రీకాంత్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు టి.సత్యప్రసాద్,నగర అధ్యక్షుడు ఆర్.బాలకృష్ణ,నేతలు మాజీద్,కల్యాణ్,అనిల్,అరుణ్ పాల్గొన్నారు.

అభినందనలు: అంతర్జాతీయ స్థాయి కరాటే పోటీల్లో బీఎస్ మక్తాకు చెందిన బాలుడు ప్రతిభ చాటాడు. గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో ఈ నెల 22న జరిగిన జేకేపి ఇన్విటేషన్ ఇంటర్నేషనల్ కరాటే చాంపియన్‌షిప్ పోటీల్లో షేక్ ఆజామ్ అండర్ – 16 విభాగంలో బ్రాంజ్ మెడల్ సాధించాడు. బీఆర్ఎస్ సోమాజిగూడ డివిజన్ అధ్యక్షులు షేక్ అహ్మద్ కుమారుడైన ఆజామ్ చిన్న నాటి నుంచే కరాటేపై ఆసక్తి కనబర్చడంతో ఆయనకు ఎల్బీస్టేడియంలో స్పోర్ట్స్ కోచ్ రమేశ్ గౌడ్ నేతృత్వంలో శిక్షణ ఇచ్చారు. అంతర్జాతీయ పోటీల్లో తెలంగాణ తరపున పాల్గొన్న ఆజామ్ బ్రాంజ్ మెడల్ సాధించడాన్ని మాజీ మంత్రి, ఎమ్మెల్యే, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రశంసించారు. వారి వెంట బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి మన్నె గోవర్ధన్ రెడ్డి ఉన్నారు. – ఖైరతాబాద్, జనవరి 27

ఇందిరమ్మ ఇండ్లకు సూపర్ చెక్

రహ్మత్‌నగర్‌లో ఇందిరమ్మ ఇండ్ల కోసం సూపర్ చెక్ చేపడుతున్న ఇన్‌చార్జి ఏఎంసీ బాల్‌రాజ్

జూబ్లీహిల్స్,జనవరి 27: యూసుఫ్‌గూడ సర్కిల్‌లో ఇందిరమ్మ ఇండ్ల సూపర్ చెక్ కార్యక్రమం చేపడుతున్నారు. ప్రజా పాలన కార్యక్రమంలో దరఖాస్తు చేసుకున్న వారి ఇండ్లకు జీహెచ్ఎంసీ సిబ్బంది వాస్తవంగా వెళ్లారా లేదా అన్నది క్షేత్రస్థాయిలో అధికారులు పరిశీలిస్తున్నారు. ఇందిరమ్మ ఇండ్లకు జీహెచ్ఎంసీ 19వ సర్కిల్‌లో 39 వేల దరఖాస్తులు అందాయి. జీహెచ్ఎంసీ అధికారులు ఈనెలాఖరు వరకు ఇందిరమ్మ ఇండ్ల సర్వే పూర్తిచేయడంతో పాటు 5 శాతం ఇండ్లను ర్యాండమ్ చెక్ చేసే లక్ష్యంగా సూపర్‌చెక్‌ను వేగవంతం చేస్తున్నారు. ఈ మేరకు 5 అంశాలతో కూడిన ప్రశ్నలను అధికారులు లబ్ధిదారుల నుంచి సేకరిస్తున్నారు. ఇందులో ప్రధానంగా జీహెచ్ఎంసీ సిబ్బంది దరఖాస్తుదారు ఇంటికొచ్చి సర్వే చేశారా లేదా ఫోన్‌లోనే ఈ ప్రక్రియను పూర్తిచేశారా అని తెలుసుకుంటున్నారు. దరఖాస్తుదారు ఇంటి యజమానిగా ఉన్నారా లేదా కిరాయిదారుగా ఉన్నారా.. ఆర్‌సీసీ రూఫ్ ఉందా.. మట్టి ఇటుకలతో కట్టిన ఇంట్లో ఉన్నారా.. లేదా సిమెంట్ బ్రిక్స్‌తో కట్టిన ఇంట్లో ఉన్నారా తదితర ప్రశ్నలతో అధికారులు యాప్ ద్వారా సర్వే చేపడుతున్నారు. జీహెచ్ఎంసీ 19 వ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ జాకియా సుల్తానా ఆధ్వర్యంలో అన్ని విభాగాధిపతులు, ఇతర అధికారులు సూపర్‌చెక్ కార్యక్రమంలో పాల్గొన్నారు.

కార్మికులకు నష్ట పరిహారం ఇవ్వాలి

రాష్ట్ర అధ్యక్షుడు వీఎస్‌బోస్

హిమాయత్‌నగర్,జనవరి 27: హుస్సేన్ సాగర్‌లో చోటు చేసుకున్న బోట్ల ప్రమాదంలో గాయపడిన టూరిజం కార్మికులకు రూ.10లక్షల నష్ట పరిహారం ఇవ్వాలని తెలంగాణ టూరిజం అభివృద్ధి సంస్థ కాంట్రాక్ట్,ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు వీఎస్‌బోస్,రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సబ్బు రాజమౌళి సోమవారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈవెంట్స్ పేరుతో హుస్సేన్ సాగర్‌లో జరిగే ఫైర్‌వర్క్స్ కార్యక్రమాలను రద్దు చేయాలన్నారు.

ప్రాణాలకు తెగించి ధైర్యంతో మహేందర్ అనే కార్మికుడు స్పీడ్‌గా బోట్‌ను నడిపి అనేక మందిని కాపాడటం అభినందనీయమ న్నారు.

భవనం పైనుంచి పడి వ్యక్తి దుర్మరణం

బంజారాహిల్స్,జనవరి 27: ప్రమాదవశాత్తూ మెట్ల మీద నుంచి కిందపడిన దినసరి కూలీ దుర్మరణం పాలైన ఘటన ఫిలింనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. ఒరిస్సాకు చెందిన సదానంద్(41) అనే వ్యక్తి బతుకుదెరువు కోసం నగరానికి వచ్చి కూకట్‌పల్లిలో నివాసం ఉంటున్నాడు. దినసరి కూలీగా పనిచేస్తున్న సదానంద్ సోమవారం భార్యతో కలిసి ఫిలింనగర్ రోడ్డు నంబర్ 3లోని అపోలో ఆస్పత్రి చౌరస్తా సమీపంలో నిర్మాణంలో ఉన్న ఓ భవనంలో పనిచేస్తున్నాడు. రెండో అంతస్తుకు ఇసుకను తీసుకెళ్తున్న సమయంలో మెట్లమీదనుంచి అదుపుతప్పి కిందపడి అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటనపై సమాచారం అందుకున్న ఫిలింనగర్ పోలీసులు మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం గాంధీ దవా ఖానకు తరలించారు.

భవనం యజమాని శ్రీధర్‌రెడ్డిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

మున్సిపాలిటీలల్లో 'ప్రత్యేక' నజర్

- బాధ్యతలు చేపట్టిన ప్రత్యేకాధికారులు
- నిధుల కేటాయింపులు, ట్యాక్స్ వసూళ్లపై ఆరా
- ప్రజలు నేరుగా కలిసి సమస్యలు

విన్నవించవచ్చని వెల్లడించిన అధికారులు

మణికొండ మున్సిపాలిటీ ప్రత్యేక అధికారిగా బాధ్యతలు చేపట్టిన జె.శ్రీనివాసరావుకు పుష్పగుచ్ఛం అందజేసి ఆహ్వానం పలుకుతున్న మున్సిపల్ కమిషనర్ ప్రదీప్‌కుమార్, అధికారులు

మణికొండ, జనవరి 27 : రాజేంద్రనగర్ నియోజకవర్గ పరిధిలోని మున్సిపాలిటీల్లో ప్రత్యేకాధికారులు సోమవారం కొలువుదీరారు. ఐదేళ్ల పదవీకాలం ముగియడంతో ప్రజాప్రతినిధులు అంతా మాజీలుగా మారడంతో ప్రత్యేకాధికారులు ప్రజాసమస్యల పరిష్కారానికి శ్రీకారం చుట్టారు. నియోజకవర్గ పరిధిలోని మణికొండ మున్సిపాలిటీ ప్రత్యేక అధికారిగా జె.శ్రీనివాసరావు, నార్సింగి, బండ్లగూడ, శంషాబాద్ మున్సిపాలిటీలకు ప్రత్యేక అధికారిగా పి.శ్రీధర్‌లు పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయా మున్సిపాలిటీల కమిషనర్లు వారికి ప్రత్యేక స్వాగతం పలికి ప్రత్యేక సమీక్షా సమావేశాలను నిర్వహించారు. మున్సిపాలిటీల పరిధిలోని వివిధ వార్డులల్లో పారిశుధ్య పనుల నిర్వహణ, ట్రేడ్ లైసెన్సుల జారీ, ఎల్ఆర్ఎస్ సర్వే, ప్రాపర్టీ ట్యాక్స్ కలెక్షన్స్, ఇంజినీరింగ్ విభాగంలో వివిధ వార్డుల్లో కొనసాగుతున్న అభివృద్ధి పనుల పురోగతి, అకౌంట్ విభాగంలో బ్యాలెన్స్ చెల్లింపులు, ఆడిట్ అభ్యంతరాలు, బ్యాంక్ లింకేజ్, ఇందిరా మహిళాశక్తి పథకం,వివిధ టార్గెట్లు, నూతన సంఘాల ఏర్పాటుపై సమీక్షలు నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఇకపై మున్సిపాలిటీలల్లోని ప్రజలు తమ సమస్యలపై నేరుగా ప్రత్యేక అధికారులను కలిసి తెలుపవచ్చునని వెల్లడించారు. ప్రత్యేక చొరవతో సమస్యల పరిష్కారానికై కృషిచేస్తామన్నారు. ఈ సమావేశాలల్లో మున్సిపల్ కమిషనర్లు కృష్ణమోహన్‌రెడ్డి, ప్రదీప్‌కుమార్, శరత్ చంద్ర,వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పాఠశాల అభివృద్ధికి దాతలు సహకరించాలి

మదన్‌పల్లి పాతతండాలోని ప్రభుత్వ పాఠశాలకు వివిధ వస్తువులు అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకుడు, నాగేష్‌నాయక్, తదితరులు

శంషాబాద్ రూరల్, జనవరి 27 : ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి దాతల సహకారం అవసరమని మదన్‌పల్లి పాతతండా ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సావిత్రి తెలిపారు. సోమవారం మదన్‌పల్లి పాతతండా మాజీ వార్డు సభ్యుడు బీఆర్ఎస్ నాయకుడు నాగేష్‌నాయక్ పాఠశాలకు కుర్చీలు, అంగన్‌వాడీ సెంటర్‌కు ఆట వస్తువులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సావిత్రి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలకు దాతల సహకారం అవసరమన్నారు.

కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు అన్నపూర్ణ, పృథ్వీరాజు, వనజతో పాటు యువకులు ఎం రఘు, ఎన్ సంతోష్, ఎం వినోద్‌కుమార్, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

ఎల్వోసీ అందజేత: సీఎం సహాయనిధి పథకం ఆపదలో ఉన్న పేదలను ఆపద్బాంధవుడిలా ఆదుకుంటుందని రహ్మత్‌నగర్ కార్పొరేటర్ సీఎన్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం వెంగళరావునగర్ డివిజన్ జవహర్ నగర్‌కు చెందిన జి.శ్రీనివాస్‌కు సీఎం రిలీఫ్ ఫండ్ కింద మంజూరైన రూ.2.50 లక్షల ఎల్వోసీని కార్పొరేటర్ కార్యాలయంలో అందజేశారు. సీఎంఆర్‌ఎఫ్‌తో పేదలకు ఎంతో మేలు జరుగుతుందని.. ఈ పథకాన్ని అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు.– జూబ్లీహిల్స్

మద్యం విక్రయిస్తున్న ఇద్దరిపై కేసులు

బంజారాహిల్స్,జనవరి 27: రిపబ్లిక్‌డే రోజున అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తులపై బంజారాహిల్స్, ఫిలింనగర్ పోలీస్‌స్టేషన్లలో కేసులు నమోదయ్యాయి. వివరాల్లోకి వెళ్తే.. ఆదివారం రోజున రిపబ్లిక్ డే కావడంతో మద్యం విక్రయాలపై నిషేధం ఉంది. దీనిని దృష్టి లో పెట్టుకుని డబ్బు సంపాదించే ఉద్దేశంతో బంజారాహిల్స్ రోడ్డు నంబర్ 10 సింగాడకుంటకు చెందిన మహ్మద్ యూసుఫ్ అనే ఆటో డ్రైవర్ ఎన్‌బీనగర్ కమాన్ వద్ద ఉన్న రిలాక్స్ నాగసత్య వైన్స్ వద్ద మద్యం బాటిళ్లు కొన్నాడు. దీనిని కమాన్ వద్ద మద్యం విక్రయిస్తున్న విషయాన్ని శనివారం రాత్రి గుర్తించిన పోలీసులు అతడిని అరెస్ట్ చేసి 31మద్యం బాటిళ్లను, రూ.2600 నగదును స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు యూసుఫ్‌తో పాటు వైన్ షాపు నిర్వాహకులపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

- మరో ఘటనలో ఫిలింనగర్ పరిధిలోని షేక్‌పేటకు చెందిన సూరజ్ కుమార్(35) అనే వ్యక్తి రిపబ్లిక్ డే రోజున షేక్‌పేట ప్రధాన రోడ్డులోని డీమార్ట్ వద్ద నిలబడి మద్యం అమ్ముతున్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు అతడిని అరెస్ట్ చేశారు. అతడి వద్దనుంచి 20 బాటిళ్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.

అసత్య ప్రచారాలు మానుకోవాలి

శంషాబాద్ రూరల్, జనవరి 27 : హైదరాబాద్‌లోని గోల్కొండ చౌరస్తాలోని హెబ్రోన్ చర్చి కేంద్ర కార్యనిర్వాహక సంఘంపై మాజీ ఎమ్మెల్సీ డి . రాజేశ్వర్ అసత్య ప్రచారాలు మానుకోవాలని ఇండియన్ క్రిస్టియన్ కౌన్సిల్ అధ్యక్షుడు షావల జోసెఫ్ కోరారు. కొంతకాలంగా నిజామాబాద్ మాజీ ఎమ్మెల్సీ డి . రాజేశ్వర్‌తో పాటు మోహన్ బాబు,ప్రసాద్ చౌదరి అనే వ్యక్తులు హెబ్రోన్ కేంద్ర కార్యనిరాహక సంస్థపై చేస్తున్న అసత్య ఆరోపణలను ఖండించారు.సోమవారం శంషాబాద్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ 1957లో భక్త సింగ్ అనే వ్యక్తి గోల్కొండ చౌరస్తాలో హెబ్రోన్ సంస్థ(చర్చి)ని స్థాపించి 1971లో రిజిస్ట్రేషన్ చేయించారని తెలిపారు. అప్పటి నుంచి కేంద్ర కార్యనిర్వాహక సంఘం కొనసాగుతూ ప్రపంచ వ్యాప్తంగా 20వేల అనుబంధ సంఘాలను కలిగి ఉందని వివరించారు. తెలంగాణ రాష్ట్రంలోనే 10వేల సంఘాలు ఉన్నట్లు చెప్పారు. సంస్థకు కావాల్సిన ఆధారాలు తమవద్ద ఉన్నాయన్నారు.

విద్యార్థులకు అల్పాహారం ఏర్పాటు

మణికొండ, జనవరి 27: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు అండగా ఉంటూ వారి ఇబ్బందులను పరిష్కరించేందుకు అందరూ ముందుకు రావాలని వీఆర్4సహయోగ్ చారిటబుల్ మేనేజింగ్ ట్రస్టీ అందె లక్ష్మణ్‌రావు అన్నారు. మణికొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మున్సిపాలిటీ మాజీ కౌన్సిలర్ రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో అల్పాహారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు అదనపు తరగతులు నిర్వహిస్తుండడంతో వారికి సాయంత్రం సమయంలో అల్పాహారం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు నిరంజన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రెడ్డి సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ: మణికొండ మున్సిపాలిటీ రెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం నూతన సంవత్సర–2025 క్యాలెండర్‌ను మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ కె.నరేందర్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్ కె.రామకృష్ణారెడ్డిలు ముఖ్యఅతిథులుగా హాజరై ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రెడ్డి ఫౌండేషన్ సంఘ ప్రతినిధులు కె.నరేందర్‌రెడ్డి, కె.శ్రీకాంత్‌రెడ్డి, శ్రీపతిరెడ్డి, రామసుబ్బారెడ్డి, శరత్‌రెడ్డి, బాల్‌రెడ్డి, రాంరెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.– మణికొండ

సెల్‌ఫోన్ దొంగతనానికి యత్నం

చేజ్ చేసి పట్టుకున్న పోలీసులు

ఖైరతాబాద్, జనవరి 27 : సెల్‌ఫోన్ దొంగతనానికి యత్నించిన ముగ్గురు పోలీసులకు చిక్కారు. సైఫాబాద్ డీఎస్పై సుదర్శన్ తెలిపిన వివరాల ప్రకారం.. ..మల్లేపల్లి అఫ్జల్‌నగర్‌కు చెందిన హక్కాడే గాబ్రు (23), ఆటో డ్రైవర్ కాంబ్లే వికాస్ (23), విజయనగర్‌కాలనీ గాంధీనగర్‌కు చెందిన మహ్మద్ సాహిల్ అలీ (24) సెక్రటేరియేట్ సమీపంలో ఓ ఆర్టీసీ బస్సు ఎక్కారు. ప్రయాణికులతో కూర్చొని వారి సెల్‌ఫోన్లు దొంగలించేందుకు సిద్ధమయ్యారు. బస్సులోనే ఉన్న పోలీసులు వారిని గుర్తించగా కిందకు దిగి పరుగులు పెట్టారు. దీంతో వారిని చేజ్ చేసిన అదుపులోకి తీసుకొని స్టేషన్‌కు తరలించారు.

పాత నేరస్తుడి అనుసరించగా....

గాంధీనగర్‌కు చెందిన మహ్మద్ సాహిల్ అలీ గతంలో సైఫాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఓ దొంగతనం కేసులో నిందితుడు. కొంత కాలంగా సాహిల్‌పై నిఘా పెట్టిన పోలీసులు సోమవారం అతడిని అనుసరించారు. అతనితో పాటు బస్సు ఎక్కగా, వెతుకుతున్న తీగ కాలికి తగిలినట్లు సెల్‌ఫోన్ దొంగతనానికి సాహిల్‌తో పాటు బస్సు ఎక్కిన మరో ఇద్దరూ సైతం పోలీసులకు చిక్కారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.